**కథ** — **యస్. శ్రీదేవి**

# కొత్త అతిథికోసం

**పగలంతా బాగా వర్షం కురిసి సాయంత్రానికి తెరిపి నిచ్చింది. తడిసిన మట్టి వాసన పీలుస్తూ ఆరుబయట నిల్చుంటే కడిగిన ముత్యంలా ప్రకృతి మైమరపిస్తోంది.**

**"మమ్మీ! కాసేపలా వెళ్ళి ఆడుకుని వచ్చేస్తాం" సోనూ తన జత పిల్లల్ని వెంటబెట్టుకుని వచ్చింది.**

''స్వెట్టర్లేసుకుని వెళ్ళండి. చలిగా వుంది. ఎక్కువసేపు వుండద్దు. చప్పునొచ్చేయ్యండి'' హెచ్చరించాను.

పిల్లలు తూనీగల్లా పరిగెత్తారు. పగలంతా యింట్లోనే వుండి విసిగిపోయారేమో, ఆ విసుగంతా వాళ్ళ పరుగుల్లో తుర్రుమంది. నేను మొక్కల మధ్య కాసేపు తిరిగి లోపలికొచ్చాను. నా వెనకాలే పిల్లలూ వచ్చేసారు.

అందరికన్నా ముందొచ్చి నా చెరోపక్కనీ నిలబడ్డవాళ్ళు సోనూ, మనోజ్. ఇద్దరి మొహాల్లోనూ సంభ్రమం. ఏదో అద్భుతం జరిగినంత ఆశ్చర్యం.

''మమ్మీ! మమ్మీ!'' తన పిడికిలి తెరిచి చూపించింది సోనూ.

చిన్న చేపపిల్ల! కొర్రమీను.

నేను ఒక్కడుగు వెనక్కేసాను. ''ఛీ..ఛీ.. పారెయ్యండి. ఎక్కడి నుంచీ తెచ్చారు దీన్ని? ముందది చచ్చిపోతుంది. నీళ్ళలో పడేసెయ్యండి. తర్వాత తీసికెళ్ళి కాలువలో వదిలిపెట్టండి'' అని కేకలు పెట్టాను.

మనోజ్ ఒక్క పరుగున వెళ్ళి మగ్గుతో నీళ్ళు తెచ్చాడు. సోనూ చేతిలోని చేపపిల్లని అందులోకి వదిలింది. ప్రాణం వచ్చినట్టై అది నీళ్ళలో కదలడం మొదలుపెట్టింది. అది ఈదుతుంటే వీళ్ళిద్దరూ విస్మయంగా చూస్తున్నారు. నాకు తల్లో పేనుని చూసినా వీధిలోని కుక్కని చూసినా ఒకే విధమైన ఎలర్జీ. కుక్కపిల్లనీ, పిల్లి పిల్లలనీ దేన్నీ కూడా పెంచుకోవాలనిపించదు. మిగిల్తే యింతన్నం పేపర్లో పెట్టి తెచ్చి, గేటవతల పెడ్తాను. ఏ కుక్కో తిని వెళ్తుంది. అంతకు మించిన అనుబంధాన్ని పెంచుకోను.

ప్రదీప్, సోనూ అలా కాదు. వీధిని పోయే కుక్కపిల్ల, పెరట్లో దొరికిన వంటరి పిల్లికూన, దారితప్పిన గొర్రెపిల్ల, మందలోంచీ జారుకున్న మేకపిల్లా- అన్నీ వాళ్ళిద్దరికీ నేస్తాలే. ఒక రోజో, రెండు రోజుల్లో వాటితో ఆడుకుని గమ్యానికి చేరుస్తారు. ఇప్పుడీ చేపపిల్ల మా కొత్త అతిథి.

ప్రదీప్ ఆఫీసు నుంచీ వచ్చేదాకా పిల్లలిద్దరూ మగ్గునీ చేపనీ కాపలాకాస్తూ కూర్చున్నారు. కారణం మూడుసార్లది బైటికి గెంతింది. మిగిలిన పిల్లలంతా ఆటలకి వెళ్ళిపోయారు.

ప్రదీప్ స్కూటర్ చప్పుడు వినగానే యిద్దరూ ఈ వార్త అందించడానికి వెళ్ళిపోయారు.

నేను మగ్‌లోకి తొంగి చూసాను. గిరికీలు కొడ్తూ యీదుతోంది అందులోని చిన్నిప్రాణి. నల్లగా వుంది. పెద్ద అందంగా ఏమీ లేదు. ఒక మొప్పమీద పుట్టుమచ్చలాంటి చుక్కేదో వుంది. ఒక చోట తటస్థంగా వుండకుండా కాసేపు తోకమీద నిలబడి గెంతుతూ, కాసేపు గిరికీలు కొడుతూ యీదుతోంది. దాని టైనీనెస్.. అదేనా దానిలోని ఆకర్షణ? తేల్చుకోలేకపోయాను.

ప్రదీప్ యింట్లోకి రావటమే పెద్ద కోలాహలంగా వచ్చిపడ్డాడు. సిటీ అవుట్‌స్కర్ట్స్‌లో వుంటుంది మా యిల్లు. అతని ఆఫీసుకి దాదాపు గంట ప్రయాణం. కానీ అంతసేపు స్కూటర్‌మీద ప్రయాణించిన అసలటేదీ అతని ముఖంలో కనిపించలేదు.

''ఏదేదీ?'' అంటూ కొత్త అతిథిని చూసి చాలా ముచ్చటపడ్డాడు.

''ఇంక ఆడింది చాలుగానీ, దీన్నా కాలువలో వదిలేసి రండి'' అన్నాను.

''చాల్చాల్లే! ఇంతందంగా వున్నదాన్ని వదిలెయ్యమంటావేంటి? మేం దీన్ని పెంచుకుంటాం. ఈసారి నీ మాట వినేది లేదు. నీకు చిరాకు కలిగేలా యిది యిల్లంతా తిరగదు. ఒక్కచోటే వుంటుంది. సీ... ఎంత బావుందో!'' అని సరదాపడ్తూ ఒకటే హడావిడి పెట్టేసాడు.

''సోనూ! పెద్ద బోర్నవిటా సీసా తీసుకురా! దీన్నందులో పెడదాం. మనో, గోధుమపిండి చిన్నవుండ చేసి పట్రా! సోనూ...యిప్పుడు నీ టర్న్. కాంపౌండులో మూల ఇసుక వుంది చూడు, అందులోంచీ గులకరాళ్ళూ, శంఖాలూ, గవ్వలూ ఏరి తీసుకురావాలి. మనో పెద్ద మగ్‌తో నీళ్ళు తేరా...'' అంటూ కమేండ్లిస్తుంటే పిల్లలు 'ఎస్ బాస్' స్టయిల్లో చేసారు. నేను నిస్సహాయంగా చూసాను.

చేప పిల్లలకి చిన్న ఎక్వేరియం రెడీ. సోనూ దాన్ని తన టేబుల్ మీద పెట్టుకుంది. మనోజ్ చిన్నబుచ్చుకున్నాడు. ''రేపు నీ టేబుల్ మీద ఒకరోజు నీ దగ్గర, ఒకరోజు సోనూ దగ్గర'' వంతులు వేసాడు ప్రదీప్. మనోజ్ కన్విన్స్ యాడు. కాసేపటికి వాడికి యింటి నుండీ పిలుపొచ్చింది. వెళ్ళిపోయాడు. సోనూ మాత్రం తన స్టడీ టేబుల్‌కే అతుక్కుపోయింది. అన్నం కూడా అక్కడే తింది.

మర్నాడు స్కూల్ నుంచీ వస్తూ సోనూ తన ఫ్రెండ్సందరినీ వెంటబెట్టుకుని వచ్చింది. కొత్త నేస్తాన్ని చూపించడానికి.

వాళ్ళంతా ఒకటే మాట.. ''మీరు ఫిష్ తింటారా?'' అని.

''ఊహు..'' అంది సోనూ.

''మరి దీన్నేం చేస్తారు? రెండు, మూడు నెలల్లోనే యింత పెద్దదౌతుంది'' మోచెయ్యి దాకా కొలత చూపిస్తూ అడిగాడొక అబ్బాయి.

''మేం పెంచుకుంటాం''


''పెంచుకుని ఏం చేస్తారు?''

''ఏదో ఎందుకు చెయ్యాలి? ఏమీ చెయ్యం.''

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి.

బోర్నవిటా సీసాలోని చేపపిల్ల జానెడైంది. నానిన సేమ్యా పలుకులు, గోధుమపిండి వుండలు, పాలకూర ఆకులు, ఏం పెట్టచ్చో జాగ్రత్తగా తెలుసుకుని, పక్కా శాఖాహారిలా పెంచుతున్నారు దాన్ని. ఇప్పుడుంచిన సీసా దానికి చాలటం లేదు. అది స్వేచ్ఛ కోరుకుంటోందేమో, దానికీ భావోద్వేగాలున్నాయేమో



నాకు
తె లీద ం.
అయిష్టంగా, అనాస
క్తిగానైనా దాన్ని గమనించటానికి అలవాటు పడ్డాను. అది చోటు చాలక సీసా గోడల్ని కొట్టుకుంటే దానికి కోపం వచ్చి, యిలా ప్రదర్శిస్తోందేమోననుకుంటాను.

ప్రదీప్ చిన్న గ్లాస్ బాక్స్ కొనుక్కొచ్చి అందులోకి దీన్ని మార్చాడు. సోనూ దాంతో బాగా ఎటాచ్‌మెంటు పెంచుకుంటోంది. అది తనదని అనిపించుకోవటానికి మనోజ్ ఏదడిగితే అది యిచ్చేసింది. చాక్లెట్ రేపర్స్‌తో చేసుకున్న బొమ్మలు, నేమ్‌స్లిప్స్, సెంటెడ్ పెన్ను.. ఏదంటే అది.

★ ★ ★

అనూహ్యమైన సంఘటన జరిగిపోయింది.

ప్రదీప్ ఫ్రెండు, ప్రసాద్ మా యింటికొచ్చాడు. వస్తూనే సోనూ టేబుల్ మీద వున్న గ్లాస్ బాక్స్ మీద అతని దృష్టిపడింది.

''అరే.. కొర్రమీను, బాగా పెద్దదైంది. మీకెందుకిది?'' అడిగాడు.

''సోనూ పెంచుతోంది. ఆమధ్యని పిల్లలంతా ఆడుకోవడానికి వెళ్తే కాలువగట్టున దొరికిందట'' చెప్పాను.

''బాగా పెద్దదైంది. వికారంగా లేదూ? పెంచుకోవటానికి యివికాదు. నేను తనకి గోల్డ్‌ఫిష్ తెచ్చిస్తాను. చిన్న ఎక్వేరియం బాక్స్ కూడా'' అంటూ నేనింకో మాట చెప్పినా వినకుండా దాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

స్కూలు నుంచీ రాగానే సోనూ బాగా గొడవ చేసింది చేప ఏదని.

''ప్రసాదంకుల్ తీసుకెళ్ళాడే. ఇదేం బాలేదట. రేపు చిన్న చిన్న గోల్డ్‌ఫిష్ తెచ్చిస్తానన్నాడు'' అన్నాడు.

''బాలేనిది అంకుల్‌కెందుకట? నా ఫిష్ నాకే కావాలి'' అంది ఏడుస్తూ. ప్రదీప్ వచ్చేదాకా ఏడుస్తూనే వుంది.

''ఇది గొడవ చేస్తుందని తెలీదా? ఎందుకిచ్చావ్?'' అని నన్ను కోప్పడ్డాడు.

''బావుంది. అతను నా మాట వినిపించుకుంటేనా?'' అన్నాను నేను.

ప్రదీప్ అలాగే వెళ్ళిపోయాడు ప్రసాద్ వాళ్ళింటికి. చాలాసేపయ్యాక తిరిగొచ్చాడు. వెంట ప్రసాద్ కూడా వున్నాడు. నల్లచేపగానీ ఎక్వేరియం బాక్స్‌గానీ లేదు. రెండు కుందేళ్ళున్నాయి. వాటిని గడ్డిలో వదిలిపెడ్తే గెంతుతూ అటూ యిటూ తిరగటం మొదలుపెట్టాయి. సోనూ వాటి ప్రేమలో పడిపోయింది. ఖిత్తులిద్దరూ లోపలికొచ్చారు.

ఉన్నట్టుండి ప్రసాద్ పెద్దగా నవ్వటం మొదలుపెట్టాడు. హాలంతా దద్దరిల్లిపోతోంది.

''ఏంటి?'' అడిగాను నేను.

''శాఖాహారి చేప'' అన్నాడు నవ్వుతూనే. నాకూ నవ్వొచ్చింది.

''అదేంటి?''

అతను చెప్పేంతల్లో సోనూ వచ్చింది.

''అంకుల్! నా చేపేది?'' అడిగింది కోపంగా.

దగ్గరకి రమ్మని చేతులు చాపాడతను. సోనూ తన కోపాన్ని యింకా వ్యక్తపరుస్తూ దూరంగానే నిలబడింది. అతనే లేచి వెళ్ళి ఎత్తుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు.

''మీ యింటికి రాగానే ఆ చేప ఏడుస్తూ కని

పించిందిరా సోనూ!'' అన్నాడు.

''నాకెప్పుడూ అలా కనిపించలేదుగా?''

''నీళ్ళల్లో వుంటుంది. అందుకేమో!''

''మరి నీకెలా కనిపించింది?''

''నాకు వాటి భాష తెలుసు''

''ఎలా వచ్చు?''

''మా యింట్లో అక్వేరియం బాక్స్ వుంది కదా? రోజూ వాటితో మాట్లాడుతుంటాను.''

''ఐతే నా చేపేమంది?''

''ఈ సోనూ నాకన్నీ నచ్చునివే పెడ్తోంది. నచ్చేవేవీ పెట్టదు'' అంది.

''దానికేంటిష్టం?''

''ఫిష్ ఫీడ్''

''అంటే?!''

''వామ్స్''

''యాక్!'' అంది సోనీ వెంటనే. ప్రసాద్ మళ్ళీ నవ్వేసాడు. అతనూ ప్రదీప్ కలిసి అక్వేరియం షాపుకి వెళ్ళారట. ఫిష్ ఫీడ్ మాట వినగానే ప్రదీప్ వద్దనేసాడట. తిరిగొస్తూ దార్లో కుందేళ్ళని కొనుకొచ్చారు.

''కుందేళ్ళు శాఖాహారులు. వాటికి మంచిగా గడ్డీ, కేరట్లు పెట్టి పెంచు. నేనొస్తాను, తీసికెళ్ళడానికి'' అన్నాడు ప్రసాద్ నవ్వుతూ.

''ఎందుకు తీసికెళ్ళడం?'' అని సోనూ అడుగుతూనే వుంది. అతను జవాబివ్వకుండా నవ్వుతూనే వున్నాడు.

★ ★ ★

ఎర్రటి భావహీనమైన కళ్ళతో గడ్డిలో తిరుగుతున్న కుందేళ్ళని చూస్తుంటే నాకెలాంటి యిష్టమూ కలగలేదు. మనం పిలిచినా చిటికేసినా అవి స్పందించవు. వాటికి మనుషులతో ఎలాంటి అనుబంధం వుండదు. తెల్లగా వెన్నెల ముద్దల్లా వుంటాయని వాటిని చూసి మనం సంతోషపడటమే. వాటి గెంతులు, వాటి తిండీ, వాటి ప్రపంచం వాటిది. అవి తొందర తొందరగా పిల్లల్ని పెడుతున్నాయి. బొటన వేలంత చిన్న చిన్న పిల్లల్ని. వాటిని కాపాడటం కష్టంగా వుంది. కాంపౌండులో పెద్దవి తిరుగుతుంటే వీధి కుక్కలు గేటు దగ్గరకొచ్చి మొరుగుతున్నాయి. ప్రదీప్‌కి ఎందుకో కుందేళ్ళ పెంపకం నచ్చలేదు. వాటిని కొన్న దగ్గరే యిచ్చేసి వచ్చాడు. సోనూ అభ్యంతరం చెప్పలేదు. పెద్దదౌతోంది.

సెవెన్త్ క్లాస్ పరీక్షలు దగ్గర పడ్డాయి సోనూకి. చదువులో పడిపోయింది. బొమ్మలన్నీ షోకేసులో స్థానాలని వెతుక్కున్నాయి.

★ ★ ★

సోనూకి డాక్టరవాలనే కోరిక ఏర్పడింది. ఆ దిశగా తన ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇంటర్లో హాస్టల్లో చేరింది. మెడిసిన్లో యింక్కెక్కడో సీటొచ్చింది. ఇల్లంతా మూగవోయింది. తనతోపాటే తన ఫ్రెండ్సంతా కూడా పెద్దయ్యారు. ఎక్కడెక్కడి కాలేజీల్లోనో సీట్లు వచ్చి వెళ్ళిపోయారు.

ఎప్పుడో సెలవుల్లో వస్తారు. ఇల్లూ వాకిలీ అంతా సందడి నింపి వెళ్తారు. వాళ్ళు వెళ్ళాక ఆ సందడి మా గుండెల్లో ప్రతిధ్వనిస్తూ వుంటుంది. జ్ఞాపకాల తరంగాలై గుండె చెలియలికట్టని తాకుతూ వుంటాయి.

ఎమ్మెస్ చేస్తున్నప్పుడు సోనూ రాహుల్ని తీసుకొచ్చి పరిచయం చేసింది. తెల్లగా పొడుగ్గా వున్నాడు. బక్కపలుచగా వున్నా దర్పం కనిపిస్తోంది. విప్రోలో సాఫ్ట్‌వేర్ యింజనీరనీ, నెలకి నలభై వేల ఆదాయమనీ తెలియగానే అనీజీగా అనిపించింది. భావరహితమైన కుందేళ్ళ కళ్ళు గుర్తొచ్చాయి. వాటి లోకం వాటిది, అందులో యింకెవరికీ ప్రవేశం లేదని కూడా. ఇతని అంతరంగిక ప్రపంచంలోకి ఓ మధ్యతరగతి ఆడపిల్లకి ప్రవేశం వుంటుందా?

''డాడీ మేం ప్రేమించుకుంటున్నాం. అతని తల్లిదండ్రులకి యిష్టమే. మీరూ వప్పుకుంటే పెళ్ళి చేసుకుంటాం'' అంది సోనూ.

నా గుండె దడదడలాడింది. ప్రదీప్ ఏమంటాడోనని చూసాను.

''వప్పుకోకపోతే?'' సీరియస్‌గా అడిగాడు ప్రదీప్.

''వప్పుకునేదాకా ప్రేమించుకుంటూనే వుంటాం'' అంది సోనూ అంతకంటే సీరియస్‌గా.

తండ్రీ కూతుళ్ళు ఒకరికంటే ఒకరు పెద్దనటులు. వాళ్ళ సీరియస్‌నెస్ నటన. మీరొప్పుకోకపోయినా మేం చేసుకుంటాం అంటే ప్రదీప్

## అవకాశాల వెల్లువ

***కోట్లాదిరూపాయలు వెచ్చించి నిర్మించే చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తాపడితే ఎలా ఉంటుంది? ఆ నిర్మాత మళ్లీ ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడరు. 'ఒక్కడు' చిత్రం విషయంలో ఎంతో రిస్క్ తీసుకుని మంచి హిట్ సాధించిన 'బిగ్' నిర్మాత ఎం.ఎస్.రాజు నవతరం హీరో ప్రభాస్‌తో ఈమధ్య నిర్మించిన 'వర్షం' కలెక్షన్ల విషయంలో కనకవర్షం కురిపిస్తోంది. దీంతో అటు ప్రభాష్‌కి, ఇటు త్రిషాకి మంచి ఆఫర్లు వచ్చిపడుతున్నాయి. త్రిషా కూడా చాలా హేపీగా ఉంది. ముందు ముందు ఈజంట మరిన్ని సినిమాల్లో కన్పించాలని భావిస్తున్నారు ప్రేక్షకులు. నిర్మాత, దర్శకులు కూడా ఈసంగతే ఆలోచిస్తున్నట్టున్నారు. బెస్టాఫ్ లక్ త్రిషా!***



ప్త్రమేవాడేమో. అతనెలాగా వప్పుకుంటాడని సోనూకి తెలుసు. అందుకే అలా అంది. ప్రదీప్ నవ్వేసి, యిద్దర్నీ ఆప్యాయంగా చూస్తూ ఓకే చెప్పాడు. నేను మాత్రం సోనూని మరోసారి ఆలోచించమని చెప్పాలనుకున్నాను.

★ ★ ★

శాఖాహారి చేప. పెద్దగా నవ్వేసాడు రాహుల్. అతనలా నవ్వుతూనే వున్నాడు. అతనికిప్పుడు సోనూ బాల్యమంతా క్షుణ్ణంగా తెలుసు. మా యింటి గేట్లోంచీ వచ్చిన అతిథులెవరో, శాఖాహారి చేప ఎలా వచ్చిందో అన్నీ స్వయంగా చూసినంత బాగా తెలుసు.

నవ్వుతూ వుండిన అతని ముఖంలో హఠాత్తుగా నీలినీడలు పరుచుకున్నాయి.

''బాల్యం యింత అందంగా వుంటుందని తెలీదు. నా చిన్నతనమంతా యిరుకు అపార్ట్‌మెంట్లలోనూ, తరగతి గదుల్లోనూ, క్లాసు పుస్తకాల్లోనూ, పెద్దవాళ్ళ యాంబిషన్స్‌లోనూ గడిచిపోయింది. నీతో పంచుకుందామంటే నా దగ్గర ఒక్క జ్ఞాపకం కూడా లేదు'' అన్నాడు సోనూతో.

నాకు బాధగా అనిపించింది అతనలా అంటుంటే. మా తరం డబ్బుకోసం అనుబంధాలని తెంచుకుంది.

ప్రదీప్ తండ్రి నా నుంచీ అపరిమితంగా కట్నకానులకని ఆశించాడు.

కొడుకు జీతంలో అధిక భాగం తనకే చెందాలనుకున్నాడు. డబ్బే మా మధ్యగల ముఖ్యమైన సంబంధం కావడంతో అది బలహీనపడి, తెగే దిశగానే కొనసాగింది. రాహుల్‌కి నలభై వేల జీతం. ఆ జీతం కోసం బాల్యాన్ని వ్యయపర్చాడు. సోనూ పరిచయమవకపోతే అందమైన బాల్యాన్ని గురించీ, మనుషుల అనుబంధాల గురించీ తెలిసేది కాదు..

ఒక తండ్రి తన పిల్లలతో వాళ్ళ స్థాయికి దిగిపోయి ఆడగలడనీ ఒక అమ్మ, తన కూతురు అపురూపంగా తెచ్చి చూపించిన గడ్డిపువ్వునీ గుడ్డి గవ్వనీ చూసి హృదయపూర్వకంగా ఆశ్చర్యాన్ని ప్రకటించగలదనీ అతనికి తెలీదు.

అతనికి ప్రపంచం తెలీదు. అతను మా మధ్యకి వస్తున్నాడు తప్పించి, సోనూని తనవైపు లాక్కోవటం లేదని నాకర్థమయాక అతనిపట్ల కలిగిన అనీజీనెస్ తొలగిపోయింది.

★ ★ ★

రాహుల్, సోనూ తిరుగు ప్రయాణమయ్యారు. రాహుల్ తల్లిదండ్రుల అడ్రస్ తెలుసుకున్నాడు, ప్రదీప్-వెళ్ళి కలవటానికి.

వెళ్ళేరోజు రాహుల్ నా దగ్గర కొచ్చి నిలబడ్డాడు. సోనూ, మనోజ్ చిన్నప్పుడు ఏదేనా చెప్పాలనుకుంటే యిలాగే వచ్చి నిల్చునే వారు. ఆత్మీయంగా అనిపించాడు.

''ఏంటి రాహుల్?'' అడిగాను.

''నేనొచ్చిన రోజు మీ కళ్ళలో కొంత అయిష్టతని కనిపెట్టాను. అది పోయిందనుకుంటాను'' అన్నాడు సంకోచిస్తూ.

'బాప్ రే!' అనుకున్నాను.

''మాకొక పాపాయి పుడితే మీకే తెచ్చి యిస్తాం. సోనూని పెంచినంత అందంగా పెంచగలరా? తన చుట్టూ వున్నవారికి ఆహ్లాదాన్ని పంచేలా. ప్రామిస్.. సోనూ పరిచయమయాకే నాకు 'తృప్తి' అనేది తెలిసింది.

నా పేరెంట్సు చాలా సంపాదించి యిచ్చారు. నన్ను బాగా చదివించి, యింకా కూడా సంపాదించుకోగలిగే అవకాశాన్నిచ్చారు. అలాగే సంపాదించాను. షేర్స్‌లో పెట్టాను. బాగా కలిసొచ్చింది. రెండు ఫ్లాట్స్ కొన్నాను. ఇంకా ఏదో సంపాదించాలన్న తపన వుండేది. పగలూ, రాత్రీ కష్టపడేవాడిని. తను పరిచయమైంది. సంపాదించడం తప్పుకాదు, కానీ అదే జీవితం కాకూడదంది.

ఆ మాటల గురించి బాగా ఆలోచించాను. ఇంకెవరేనా అంటే సంపాదించటం చేతకాక అంటున్నారని తీసిపారేసేవాడిని. కానీ, కాబోయే ఒక సర్జన్ అన్న మాటలు. ఇక్కడికొచ్చి వాటి పునాదుల్ని చూసాను'' అన్నాడు.

''కానీ సోనూ డాక్టరు, ఇంకా కెరీర్ మొదలుపెట్టలేదు. నువ్వేదైతే గుర్తించావో, ఏదైతే కాకూడదని తనందో అందుకు విరుద్ధంగా జరిగితే?''

''తనని అనుసరించే నా జీవితం వుంటుంది'' అన్నాడు స్థిరంగా. సోనూ మీద అతనికున్న ప్రేమకీ, నమ్మకానికీ ఆశ్చర్యపోయాను.

ఈ యింట్లో తన వ్యక్తిత్వపు తొలి పునాదులు వేసుకోబోయే కొత్త అతిథి కోసం నా ఆరాటం, ఆలోచనలూ మొదలయాయి. ❀

## ఆనందాతిశయం

'లగాన్' లేడీ గ్రేసీసింగ్ ఆనందానికి అంతే లేకుండాపోతోంది. చిన్నప్పటినుంచీ చెట్ల వెంట తిరగడం, అందమైన దుస్తులు ధరించడం ఎంతో ఇష్టమని చెప్పే గ్రేసీ ఇప్పుడు ఓ చిత్రంలో ఇలాంటి ఇష్టాన్ని సొంతం చేసుకుంటోంది. 'మస్కాన్' చిత్రంలో నటిస్తున్న గ్రేసీ ఆ చిత్రం మంచి హిట్ సాధిస్తుందంటోంది. 'ఈ చిత్రంలో ఆహ్లాదపరిచే గ్రామీణ వాతావరణం ఉంటుంది. నేనీ సినిమాలో ఎప్పుడూ చెట్ల వెంట తిరుగుతుంటాను. ఈ అందానికి తగ్గట్టుగా నేను ధరించే గ్లామరస్ డ్రెస్సులు నన్ను ఎంతో అందంగా చూపిస్తాయి' అంటోంది గ్రేసీ. పరిణతి చెందిన పాత్రల కోసం ఎదురుచూస్తున్న గ్రేసీకి ఈ చిత్రం గొప్ప సంతృప్తినిస్తుందని ఆమె సన్నిహితులు సెలవిస్తున్నారు. ఏం జరుగుతుందో ఈ చిత్రం పూర్తయి విడుదలయ్యాక గానీ తెలియదు.

